

# సీనియర్ జర్నలిస్ట్ ఆడెపు మహేందర్ మృతి

- నివాళులర్పించిన పాత్రికేయులు
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.25వేల తక్షణ సాయం

8లో..


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 243
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జూన్ 27, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# ఆదివాసీల జోలికి వెళ్లొద్దు

## జీవో 49ను వెంటనే రద్దు చేయాలి

- వన్యప్రాణుల సంరక్షణ పేరుతో 339 గ్రామాలు ఖాళీ
- కనుమరుగు కానున్న మూడు జిల్లాలు
- అదానీ, అంబానీలకు అటవీ భూములు కట్టబెట్టే కుట్ర
- తన నియోజకవర్గంలోనే ఆదివాసీలపై దౌర్జన్యం
- మంత్రి సీతక్కకు మావోయిస్టుల లేఖ

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు లేఖ విడుదల చేయడం సంచలనంగా మారింది. ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తుంటే మాజీ మావోయిస్టు నాయకురాలైన సీతక్క స్పందించడం లేదంటూ వారు మండిపడ్డారు. సీతక్క నియోజకవర్గంలోని ఆదివాసులపై పోలీసులు, అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం చేస్తున్నా స్పందించడంలేదంటూ లేఖలో పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం జల్, జంగల్, జమీన్ ఉద్యమానికి నాయకత్వం వహించిన అమరజీవి కొమురం భీం పేరుతో ఏర్పాటైన జిల్లాల్లోని 339 గ్రామాలను, ప్రజలను ఖాళీ చేయించేందుకు తెచ్చిన జీవో 49 ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. మోడీ, అమిత్ షాలు వన్యప్రాణుల సంరక్షణ పేరుతో ఈ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఈ జీవోతో తెలంగాణలోని కొమురం భీం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కనుమరుగు కానున్నాయని హెచ్చరించారు. అయితే మావోయిస్టుల లేఖపై సీతక్క స్పందించారు. ఆదివాసీల పట్ల తన చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదన్నారు. ఆదివాసీల జోలికి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. – వరంగల్ వాయిస్, ములుగు

వివరాలు 2లో..



# బీసీలకు మొండి చేయి

- కాంగ్రెస్ చరిత్ర అంతా అదే
- శాసన సభలో బిల్లు అమోదించి మూడు నెలలు దాటినా ప్రయోజనం శూన్యం
- శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

2లో..



8లో..

# అంతర్గత రహదారులకు శంకుస్థాపన

31వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శ్రీకారం | పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్



8లో..

# కపాలిని క్రమంలో అమ్మవారు

- రెండో రోజుకు చేరిన శాకంభరి ఉత్సవాలు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు నాగబాబు సతీమణి పద్మజ



# ఆదివాసీల జోలికి వెళ్లొద్దు

- జీవో 49ను వెంటనే రద్దు చేయాలి
- వన్యప్రాణుల సంరక్షణ పేరుతో 339 గ్రామాలు ఖాళీ
- కనుమరుగు కానున్న మూడు జిల్లాలు
- అదానీ, అంబానీలకు అటవీ భూములు కట్టబెట్టే కుట్ర
- తన నియోజకవర్గంలోనే ఆదివాసీలపై దౌర్జన్యం
- మంత్రి సీతక్కకు మావోయిస్టుల లేఖ

**వరంగల్ వాయిస్, ములుగు :** మాజీ మావోయిస్టు నాయకురాలైన సీతక్క రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దౌర్జన్యాలపై ఎందుకు స్పందించడంలేదంటూ శుక్రవారం మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో ప్రశ్నించారు. సీతక్కకు మావోయిస్టు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పేరిట ఈ లేఖ విడుదల చేయడం సంచలనంగా మారింది. రేవంత్ రెడ్డికి సొంత అక్క లాంటిదని చెప్పుకునే సీతక్క నియోజకవర్గంలో ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు దాడులు చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ ఆ లేఖలో నిలదీశారు. మోడీ, అమిత్ షా మానస పుత్రికలైన అదానీ, అంబానీలకు అటవీ భూమి కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో 49 అమలు చేసిందంటూ మండిపడ్డారు. వన్యప్రాణుల సంరక్షణ పేరుతో 339 గ్రామాలను ఖాళీ చేయించి, ఆ అటవీ భూములన్నీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుట్ర చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. జంతు సంరక్షణ పేరుతో కొమురం భీం ఆసిఫాబాద్, ములుగు, భద్రాది కొత్తగూడెం జిల్లాలను తెలంగాణ చిత్రపటం నుంచిడి తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లో అత్యంత కీలకమైన మంత్రి హోదాలో ఉండి, ఆదివాసీలపై దౌర్జన్యం జరుగుతుంటే సీతక్క మౌనంగా ఉండడం దుర్మార్గమని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన పెసా, 1/70 చట్టాలను మంత్రి సీతక్క మరిచారా అంటూ ఆమెని ప్రశ్నించారు. తెలంగాణలో ఆదివాసీల హక్కులకు సంబంధించిన పూర్తి బాధ్యత సీతక్కదేనంటూ లేఖలో స్పష్టం చేశారు.



### ఆదివాసీల సంక్షేమంలో రాజీలేదు : సీతక్క

ఆదివాసీల పట్ల తన చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల జోలికి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు జిల్లా ఏటూరు నాగారంలో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ మంత్రి కాకున్నా.. పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశమై జీవో 49 ను రద్దు చేయాలని తీర్మాణించామని గుర్తు చేశారు. మా జీవితాలకు గొడ్డలి పెట్టు లాంటి జీవోను రద్దు చేయాలని కోరానన్నారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. అ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదన్నారు. అయితే లేఖలో లేని అంశాలపై ఒక రాజకీయ పార్టీ పత్రికలు, మీడియా సంస్థలు సొంత వ్యాఖ్యానాలు చేస్తున్నాయని మండిపడ్డారు. మహిళ అని చూడకుండా అసభ్య పదజాలాన్ని వాడుతూ తమ రాజకీయ కక్షను తీర్చుకుంటున్నాయన్నారు. ఒక మహిళను పట్టుకుని సిగ్గులేదా అని రాయడం ఏం జర్నలిజం అంటూ ప్రశ్నించారు. నేను ఎన్నడూ ప్రజలకు దూరంగా లేను.. వారంలో రెండు మూడు రోజులు ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నానన్నారు. నన్ను ఎన్నికల్లో ఓడించేందుకు ఎన్నో శక్తులు పని చేశాయన్నారు. అవే శక్తులు ఇప్పుడు నన్ను టార్గెట్ చేస్తున్నాయన్నారు. ఒక కోయ మహిళలకు జనరల్ పోర్ట్ ఫోలియో దక్కడాన్ని బీఆర్ఎస్ పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. నా వ్యక్తి గత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు వీడియోలు సృష్టిస్తున్నారన్నారు. ఏ హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా నేను ఆదివాసి అడవి బిడ్డనే అన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసమే నా జీవితం అంకితం అని వివరించారు.

## బీసీలకు మొండి చేయి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కాంగ్రెస్ చరిత్ర అంతా బీసీలకు మొండి చేయి చూపడమేనని శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. హైదరబాద్ లోని తెలంగాణ భవన్ లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో ప్రతిపక్షాల సలహాలను స్వీకరిస్తాం, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోతా మంటూ చేసిన ప్రకటనలు బుట్టదాఖలయ్యాయని విమర్శించారు. ఆ దిశగా ప్రయత్నం శూన్యమన్నారు. ఇది చట్ట సభలను కూడా తప్పుదోవ పట్టించడమే అన్నారు. ఢిల్లీపై ఒత్తిడి పెంచే కార్యాచరణే లేదన్నారు. శాసన సభలో బిల్లు అమోదించి మూడు నెలలు దాటినా ప్రయోజనం శూన్యమన్నారు. మూడు నెలల్లో కనీసం 10 పర్యాయాలు మంత్రి వర్గ విస్తరణ కోసం, కప్పం కట్టడానికి ఢిల్లీ వెళ్లిన రేవంత్ బీసీ రిజర్వేషన్లపై చేసిన ప్రయత్నం ఏమిటని ప్రశ్నించారు. ఏ ఒక్క సందర్భంలో కూడా బీసీల విషయంలో సంబంధిత వర్గాలతో చర్చలు లేవన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అనేక సందర్భాల్లో ముమ్మాటికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం అంటూ ప్రకటిస్తున్నా ముఖ్యమంత్రి వైఖరి అందుకు తగ్గట్టుగా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం, బీసీల జనాభాకు అనుగుణమైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం మరొక ద్రోహం అన్నారు బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మరో వైపు బీజేపీ వాళ్ళు సన్నాయి నొక్కులు నొకుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందు దొందే అన్నారు. మోడీ హయంలో కేంద్ర బడ్జెట్ లో బీసీలకు మొండిచెయ్యే చూపారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



## జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 20 వేల సీడ్ బాల్స్ పంపిణీ

**వరంగల్ వాయిస్, మామునూరు :** పర్యావరణ పరిరక్షణ చర్యలలో భాగంగా జైళ్ళ శాఖ డీజీ సౌమ్యా మిశ్రా సూచనల మేరకు వరంగల్ జిల్లా మామునూరులోని సెంట్రల్ జైల్ ఖైదీలు 20వేల సీడ్ బాల్స్ తయారు చేసినట్లు సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఖైదీలలో సమాజంపై బాధ్యతాభావం పెంపొందించడంతోపాటు, పర్యావరణ పరిరక్షణలో వారి పాత్రను కల్పించటం ప్రధాన ఉద్దేశం అన్నారు. ప్రజలంతా ఈ సీడ్ బాల్స్‌ను తీసుకొని ఖాళీ ప్రదేశాల్లో విసిరివేయడం ద్వారా అవి మొక్కలుగా ఎదుగుతాయన్నారు. తద్వారా వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో భాగస్వాములవుతారన్నారు.




## 28న గాజర్ల రవి సంస్మరణ సభ

- వెలిశాలలో ఏర్పాట్లు
- తరలిరానున్న అభిమానులు, కుటుంబ సభ్యులు

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో ఈ నెల 28న గాజర్ల రవి అలియాస్ గణేష్ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏపీలోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈ నెల 18న తెల్లవారుజామున జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యులు, ఏవోబి కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ తోపాటు మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కుటుంబ సభ్యులు రంపచోడవరం నుంచి మృతదేహాన్ని స్వగ్రామమైన వెలిశాలకు తీసుకువచ్చి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. అయితే అంత్యక్రియలకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిశా రాష్ట్రాల నుండి కూడా అభిమానులు, సానుభూతిపరులు ఊహించని విధంగా భారీగా తరలివచ్చారు. గాజర్ల రవికి కన్నీళ్లతో కడసారి వీడ్కోలు పలికారు. సంస్మరణ సభకు వచ్చే అభిమానులకు, సానుభూతిపరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన గాజర్ల రవి తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాలైన పేద ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు అడవి బాట పట్టి సుమారు 33 సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితం గడిపి చివరికి ఎన్ కౌంటర్ లో మృతి చెందారు. అంచలంచెలుగా మావోయిస్టు పార్టీలోనే ఎదిగి కేంద్ర కమిటీ సభ్యుని హోదాలో నేలకొరగడం పట్ల ఆయా రాష్ట్రాల పేద ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఆయన సంస్కరణ సభకు తరలివచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో మావోయిస్టు పార్టీ నేతలు ఎవరు మృతి చెందిన ఈ ప్రాంతంలో దశదినకర్మ రోజున సంస్మరణ దినం నిర్వహిస్తూ, విప్లవ గేయాలు ఆలపిస్తూ, పలు నినాదాలు చేసేవారు. ప్రస్తుతం వెలిశాలలో స్తూపం ఏర్పాటు చేసే అవకాశాలు కనిపించడం లేదు. సంస్మరణ సభను మాత్రం విజయవంతం చేయాలనే పనిలో అభిమానులు, సానుభూతిపరులు నిమగ్నమయ్యారు. సంస్మరణ సభకు పోలీసుల నుంచి ఎలాంటి ఆటంకాలు రాకూడదనే సదుద్దేశంతోనే స్తూపం ఏర్పాటు కార్యక్రమాలను విరమించుకున్నట్లు తెలుస్తోంది.

# విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఉద్యోగ మేళా ప్రారంభించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉద్యోగ మేళాలు యువతకు అవకాశాలు కల్పించడంలో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ (ఓఎ) కోర్సు కోసం దాతల సహాయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి మూలమని ఎమ్మెల్యే నాయిని అన్నారు. విద్యతో పాటు మంచి లక్షణాలు, క్రమశిక్షణ, నైతికత వంటివి యువతలో ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు సాధించడంలో నిరంతరం శ్రమించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పలు సంస్కరణలు చేపడుతోందని ఎమ్మెల్యే వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా 570 కొత్త ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు, విద్యా బడ్జెట్‌ను 7శాతం నుంచి 15శాతం వరకు పెంపు, వసతి విద్యార్థుల నిత్యావసరాలు, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు, ప్రభుత్వ వసతి గురుకుల పాఠశాలల్లో డైట్ ఛార్జ్‌ను 40శాతం, కాస్మొటిక్ ఛార్జ్‌ను 200శాతం పెంపు, ప్రతి వసతి గృహానికి నేరుగా నిధులు చేరే విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల పంపిణీ చేశామన్నారు. తాను కూడా ప్రభుత్వ కళాశాలలోనే ఉన్నత విద్యను అభ్యసించానని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే, ఈ కళాశాల అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడిగా తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న నీటి ఎద్దడిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరగా నివేదికలు తయారు చేసి అందిస్తే నిధులు మంజూరు చేసి నీటి ఎద్దడి లేకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తోట పవన్, హనుమకొండ డీఐఈఓ గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఆర్‌డీఎస్‌డీఈ పర్యవేక్షకులు చందర్, కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, డీఐఈఓ వరంగల్ ఇంచార్జ్ మాధవ రావు, ప్రిన్సిపాల్‌లు సంపత్ కుమార్, రాజిరెడ్డి, శరత్‌ధృతి, భగవద్గీత మరియు శ్రీనివాస్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్న తెల్ల రేషన్ కార్డుల వెరిఫికేషన్ పనులు ప్రారంభమయ్యాయి. 27వ డివిజన్‌లోని కొండా పటేల్ కాలనీ, అబ్బని గుంట యాకుపుర, దయానంద కాలనీ, గిర్మాజిపేటలో మెప్మా సిబ్బంది ఇంటింటికీ తిరిగి వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆధార్ కార్డు, గ్యాస్ కార్డు వివరాలను సేకరించి సిస్టంలో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడుతూ కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు లేని వారికి కొత్తవి మంజూరు చేయడంతో పాటు, కార్డుల్లో పేరు లేని వారు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారని తెలిపారు. అలాగే, ఇందిరమ్మ పథకంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. పేదల పార్టీ అంటేనే కాంగ్రెస్ పార్టీ అని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నాయకత్వంలో, రాష్ట్రంలో ఎనుముల రేవంత్ రెడ్డి, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ల నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పేదలందరికీ అందిస్తోందని ప్రకాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గూడ శారద, కొండా పటేల్ కాలనీ అధ్యక్షులు దౌడు నాగరాజ్, కమిటీ సభ్యులు గూడ నవీన్, రవి, శ్రీనివాస్, శ్రీలత, సరళ దేవి, విజయలక్ష్మి, మెప్మా సీఈఓ రాజ్‌కుమార్, ఆర్‌పీలు ధనలక్ష్మి, సుజాత, అరుణ, కొండా పటేల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు వాక్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న దివంగత దంపతులు ఉప్పుల నవదీప్, స్రవంతిల పిల్లల చదువుల నిమిత్తం వాక్ ఫౌండేషన్ తమ వాగ్దానాన్ని నిలబెట్టుకుంది. గత మూడు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీ మేరకు, ఈ సంవత్సరం చదువుల కోసం రూ. 24,000 నగదును పిల్లల పెద్దనాన్న ఉప్పుల బాలుకు వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. వన్నాల వెంకటరమణ చెక్కు రూపంలో అందజేశారు. వాక్ ఫౌండేషన్ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వన్నాల వెంకటరమణ వివరించారు. ఈ ఫౌండేషన్ ద్వారా సుమారు 500కు పైగా కుటుంబాలకు నెలకు 10 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే, అనేక ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి చూపు సమస్యలున్న వారికి ఆపరేషన్లు కూడా చేయించారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల చదువుల కోసం ఆర్థిక సాయం అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను వాక్ ఫౌండేషన్ చేపడుతోంది. ఈ కార్యక్రమంలో మండ్లోజు జగన్, పట్టణ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కట్ట రాజేందర్, వంగల శ్రీనివాస్, బాలు, శ్రవణ్, ముత్తినేని లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అవయవదానానికి అంగీకార పత్రం



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** వరంగల్‌లోని రామన్నపేట, కుంటి భద్రయ్య దేవస్థానం పక్కనున్న ఓఎస్ నగర్‌లో నివసిస్తున్న 28 ఏళ్ల కొడకండ్ల యశ్వంత్ తల్లి వనజ, తన దివ్యాంగుడైన కుమారుడు మరణానంతరం అతని శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయడానికి తన పూర్తి సమ్మతిని తెలియజేశారు. తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఒక శరీరదానం కార్యక్రమాన్ని చూసి స్ఫూర్తి పొంది వనజ ఈ గొప్ప నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమని తెలంగాణ దాతల సంఘం కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వనజ కుటుంబాన్ని అభినందించారు. మరణానంతరం ఈ శరీరం సుమారు 20 నుంచి 25 మంది డాక్టర్లను తయారు చేయడానికి ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా ఉపయోగపడుతుందని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఇది గర్వించదగ్గ విషయమని, ఈ నిర్ణయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మానవాళి ఆలోచించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్‌తో పాటు వనజ, ఆశా వర్కర్, మిట్టపల్లి సమ్మయ్య, ఆడవాళ్ల సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో ఎంపీడీవో దంపతుల ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల కళాక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గణపురం ఎంపీడీఓ ఎల్.భాస్కర్ ఆయన సతీమణి అనసూయ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి సాదర స్వాగతం పలికి, గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వరునికి పూజలు నిర్వహించారు. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నాగరాజు ఎంపీడీఓ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# విష్ణుభట్ల సూర్యనారాయణ పంతులుకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** శ్రీ షిరిడి సాయి సేవా సమాజ్ సాయిబాబా మందిరం ప్రథమ వ్యవస్థాపక చైర్మన్, దివంగత విష్ణుభట్ల సూర్యనారాయణ పంతులు 30వ వర్ధంతి (పుణ్యతిథి)ని సాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూజారి కిషోర్ శర్మ, ఆలయ సిబ్బంది రాజు, సాయి తదితరులు కూడా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ హరగోపాల్ మాట్లాడుతూ సూర్యనారాయణ పంతులు భౌతికంగా లేకపోయినా వారి ఆత్మ నిరంతరం శాశ్వతానంద స్థితిలో ఉండి బాబా భక్తులను ఆశీర్వదిస్తుందని అన్నారు. వారి ఆశీస్సులతోనే సాయిబాబా మందిరం దినదిన ప్రవర్తమానమై, భక్తులను దేదీప్యమానంగా ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన ప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన నాబార్డ్ ఏజీఎం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** 'ఏక్ పెడ్ మా కీ నామ్' (ఒక చెట్టు తల్లి పేరుతో) కార్యక్రమం కింద సహకార సంఘాల ఆధ్వర్యంలో మొక్కలు నాటడం చాలా సంతోషకరమని నాబార్డ్ ఏజీఎం ఎల్. చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సహకార సంఘం భవనం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంMR కేంద్ర ప్రభుత్వం ప్రపంచ సహకార దినోత్సవాన్ని నిర్వహించడం, సహకార సంఘాల బలోపేతానికి అనేక ప్రతిపాదనలు తీసుకురావడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఎల్‌ఓ సంజీవరెడ్డి, ఆడిట్ అధికారి కోదండరాం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అజారుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్ రావు, వ్యవసాయ అధికారి మండల రాజ్‌కుమార్, డైరెక్టర్లు తక్కలపల్లి సత్యనారాయణ రావు, రమేష్ బాబు, బావని రాజేశ్వరరావు, పాక కుమారస్వామి, మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, సీఈఓ చోటే మియా, సిబ్బంది చందర్, ఇతర డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, జూన్ 27, 2025

## నల్ల బెల్లం, పటిక పట్టివేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గుడుంబా తయారీకి ఉపయోగపడే నల్ల బెల్లం మరియు పటికను అక్రమంగా మహారాష్ట్ర నుండి తరలిస్తున్న ఒక వ్యక్తిని హనుమకొండ బస్టాండ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూడూరు మండలం ఇప్పల తండాకు చెందిన ధరావత్ లచ్చిరామ్ అనే వ్యక్తి అక్రమంగా గుడుంబా తయారు చేసి తన గ్రామంలో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో, శుక్రవారం మహారాష్ట్ర నుంచి పదివేల రూపాయల విలువైన నల్ల బెల్లం, పటికను తరలిస్తుండగా హనుమకొండ పోలీసులు అతడిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఎస్సై కిషోర్, ఏఎస్ఐ రఘునారెడ్డి, కానిస్టేబుల్ కరుణాకర్‌ను ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అభినందించారు.

## మాదిగ ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ విడుదల



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మాదిగ ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మాదిగ సంఘం నాయకులు అంబాల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ముఖ్య అతిథిగా హాజరై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ సంఘం నాయకులు అంబాల రాజు మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక ప్రాంతాల మాదిగ కుటుంబ సభ్యులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, సోదర సోదరీమణులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం నాయకులు ఆకనపల్లి భద్రయ్య, పాతకాల ప్రవీణ్, లింగంపల్లి అన్వేష్, మోరే ప్రశాంత్, ఇమ్మడి రాజు, రాచపల్లి రాజ్ కుమార్, సప్పి రజినీకాంత్, మారపల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గాదె సంపత్ కుమార్‌కు అభినందనలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తాజాగా ట్రాన్స్‌కో డైరెక్టర్ (ట్రాన్స్‌మిషన్) గా బాధ్యతలు స్వీకరించిన గాదె సంపత్ కుమార్‌ను శుక్రవారం టీపీడీఈఏ ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు, స్టేట్ సెక్రటరీ జనరల్ పి. బీసి రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్. నర్సింహులు, అలాగే మాధవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, పూర్ణ చందర్, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో శుక్రవారం ఓ గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుండి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి సాయిలు తాటిచెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ సంఘటనలో సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో అతన్ని పరకాల సివిల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకి అండగా ఉంటాం

● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**వరంగల్ వాయిస్, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మంథని నియోజకవర్గం కాటారం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం గారెపల్లిలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి మంథని నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి, పీసీసీ అబ్జర్వర్లు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మానసపల్లి లింగాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అబ్జర్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా, పార్టీ జెండాను భుజాలపై మోసి నేడు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చింది నాయకులు, కార్యకర్తలేనని అన్నారు. కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి పదవులైనా ముందుగా పార్టీ కోసం పనిచేసిన వారికే దక్కుతాయని, సిఫారసుల ద్వారా నామినేటెడ్, ఇతర పదవులు ఇవ్వకుండా క్షేత్ర స్థాయిలో కృషి చేసిన వారిని గుర్తించి పదవులు వస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ మండలాల నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మహిళా, కిసాన్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే కళాశాల చుట్టూ ప్రహరీ గోడ (కాంపౌండ్) నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పనులు చేపట్టాలని బహుజన సంక్షేమ సంఘం (బీఎస్ఎస్), బహుజన స్టూడెంట్ యూనియన్ (బీఎస్ యూ) నాయకులు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును డిమాండ్ చేశారు. బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, బహుజన స్టూడెంట్ యూనియన్ మంద సురేష్ మాట్లాడుతూ, ఈ కళాశాలకు వచ్చే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు కళాశాలకు రాలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం కల్పిస్తే శాయంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి మరింత మంది విద్యార్థులు కళాశాలకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. నైపుణ్యం కలిగిన లెక్చరర్లు, అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు ఈ కళాశాలకు రాలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. కాబట్టి, ప్రభుత్వ జూనియర్ కళాశాల శాయంపేటకు బస్సు సౌకర్యం కల్పించి, ప్రహరీ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు వచ్చి చదువుకునే విధంగా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కోరారు.

# బొగతకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ బస్సులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా బొగత జలపాతానికి రెండు బస్సులు బయలుదేరాయి. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు హనుమకొండ బస్టాండ్‌లో డిప్యూటీ ఆర్. ఎం.(ఆపరేషన్స్) కే. భాను కిరణ్ కొబ్బరికాయ కొట్టి ఈ యాత్ర బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరం సింగ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక యాత్రా ప్రదేశాలను చూడాలనుకునే వారి కోసం ఆర్టీసీ టూర్ ప్యాకేజీలను ప్రకటించినట్లు తెలిపారు. ఈ ప్యాకేజీలు నాగార్జునసాగర్, బొగత జలపాతం, శ్రీశైలం, పాండవుల గుట్టలు, కాళేశ్వరం దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, వేములవాడ, కొండగట్టు, కానిపాకం, అరుణాచలం, జోగులాంబ వంటి ప్రదేశాలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ టూర్ ప్యాకేజీల కోసం ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను వినియోగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతాలే కాకుండా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, లేదా విద్యాసంస్థల వారు విహారయాత్రలకు వెళ్లాలనుకుంటే, 30 మంది ఉంటే ఆయా ప్రాంతాలకు కూడా బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 8977781103, 9493882464, 9573090136 నంబర్లను సంప్రదించవచ్చు.

# షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్ మహిళా ఇన్‌స్పెక్టర్ సుజాత విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలు, షీ టీమ్స్ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ మహిళా సీఐ సుజాత మాట్లాడుతూ, షీ టీమ్స్, సైబర్ నేరాలపై పటిష్టంగా పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు చెప్పవద్దని కోరారు. ఇతరులు ఆశ చూపినా ఆకర్షితులు కావొద్దని, మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింక్‌లను అనుసరించి వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలపై ఫిర్యాదులకు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. వేధింపులపై సమాచారం కోసం 100 డయల్‌కు కాల్ చేయాలి, మహిళల వేధింపులపై షీ టీమ్‌కు వరంగల్ షీ టీమ్ ఫోన్ నంబర్ 8712685142 కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు సోషల్ మీడియాలో బహిర్గతం చేయవద్దు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోవద్దు. మొబైల్ యాప్‌లలో వచ్చే అనవసరమైన బ్లూ లింక్‌లను క్లిక్ చేయవద్దు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపవద్దు, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించవద్దు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి. పుట్టిన తేదీలు, ఫోన్ నంబర్లను పాస్‌వర్డ్‌లుగా పెట్టుకోవద్దు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని సూచించారు. సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల సిబ్బంది, షీ టీమ్స్ సిబ్బంది, ఉపాధ్యాయులు, సుమారు 500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులా..?

## ▪ మాజీ కౌన్సిలర్ జయంత్ లాల్ ఆవేదన



**వరంగల్ వాయిస్, పరకాల:** బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ జయంత్ లాల్ పై పెట్టిన అక్రమ కేసును ఖండించారు. ఈ సమావేశంలో బాధితులు సూర విజయ, రాజయ్య దంపతులు కూడా పాల్గొన్నారు. జయంత్ లాల్ మాట్లాడుతూ పరకాల పట్టణానికి చెందిన సూర రాజయ్య ఇంటి స్థలంలో జరిగిన ఆక్రమణపై మున్సిపల్ అధికారులకు, కలెక్టర్‌కు పలుమార్లు వినతులు సమర్పించినా ఫలితం లేకపోవడంతో తనను ఆశ్రయించారని తెలిపారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా, వారు స్పందించి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారని, అప్పటి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుష్మ పోలీసు రక్షణతో కూల్చివేత పనులు చేపట్టారని వివరించారు. అయితే, ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారి సుష్మ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం అన్నారు. నాలాలపై, కల్వర్టులపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ప్రశ్నించినందుకు తనపై లేనిపోని నిందలు వేస్తూ, బీజేపీ పార్టీ ఉనికిని దెబ్బతీసే దురుద్దేశంతో అక్రమ కేసులు పెట్టి తనను దోషిగా చూపించే కుట్ర పన్నారని జయంత్ లాల్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. కాళీ ప్రసాద్ మాట్లాడుతూ, తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించినా, ప్రజల తరపున పోరాడటానికి తమ కార్యకర్తలు ఎప్పుడూ ముందుంటారని హెచ్చరించారు. బాధితుడు సూర విజయ రాజయ్య మాట్లాడుతూ తన ఇంటి స్థలం ఆక్రమణకు గురవుతుందని అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోయిందని, తనకు సహాయం చేయడానికి వచ్చిన జయంత్ లాల్‌పై డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించడం బాధాకరమన్నారు. అన్యాయం జరుగుతున్న వారికి సహాయం చేస్తే ఇలాగే కేసులు పెట్టి బెదిరిస్తారా అని బాధితుల కుటుంబం ప్రశ్నించింది. మాజీ కౌన్సిలర్‌పై పెట్టిన కేసును వాపస్ తీసుకుని, తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్లు కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, బాసాని సోమరాజు, ఎర్ర రామన్న, మేకల రాజవీరు, కానుగుల గోపీనాథ్, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గుండెబోయిన నర్సయ్య, వెనిశెట్టి శారద, గణేష్, నరేష్, మరాఠీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి భరోసా ఇచ్చారు. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన చౌదరి కనకమ్మ, లింగయ్య దంపతులకు తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సంవత్సర కాలంలోనే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. అనంతరం, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు చౌదరి కనకమ్మ, లింగయ్య.. జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న, కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి, మడిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కాయిత లింగారెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న, మడిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కాయిత లింగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు అంజి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** తమ డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, కరీమాబాద్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఏఈఈ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజు సుమారు ఐదు నుంచి పది సార్లు కరెంటు నిలిచిపోతుందని, లో–వోల్టేజీ కారణంగా కొన్నిసార్లు టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, విద్యుత్ దీపాలు పాడవుతున్నాయని కార్పొరేటర్ రవి ఏఈఈ దృష్టికి తెచ్చారు. పాతకాలంలో వేసిన కరెంటు స్తంభాలు శిథిలావస్థకు చేరుకుని పడిపోయే ప్రమాదంలో ఉన్నాయని, కొన్ని సిమెంట్ స్తంభాలకు సలాకులు బయటకు కనిపిస్తున్నాయని, కొన్ని ఇనుప స్తంభాలు షాక్ కొడుతున్నాయని, మరికొన్ని వంగి ఉన్నాయని, దీంతో ప్రజలు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఏఈఈ సంపత్, త్వరలోనే డివిజన్‌లో కొత్తగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాడైన స్తంభాలను తొలగించి, నూతన కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు చెట్టి మోహన్, చీర రమేష్, బొడ్రాయి కమిటీ నాయకులు కొండిల్ల కనకయ్య, కొండిల్ల రవీందర్ ఉన్నారు.

# ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు భూమి పూజ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆత్మకూరుకు చెందిన నాగెల్లి అనూష, మధు దంపతుల నూతన ఇళ్ల నిర్మాణ పనులను మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏడుకొండ రవీందర్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండ రవీందర్ గౌడ్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి వెల్దె వెంకటేశ్వర్లు, వర్కింగ్ పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్, కాంగ్రెస్ నాయకులు నాగెల్లి కిరణ్, జన్నారపు కరుణాకర్, బారుపట్ల రమేష్, మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు బరుపట్ల అయోధ్యతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వేమనపల్లి వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేత



**వరంగల్ వాయిస్, మంచిర్యాల:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ అందించాలని డిమాండ్ చేస్తూ ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్ వేమనపల్లి వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 09న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దేవనబోయిన బాపు యాదవ్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం లేదని, అలాగే 8 గంటల పని విధానాన్ని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ శివరంజని పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై తహసీల్దార్‌కు వినతి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా గ్రామీణ పేదల సంఘం ప్రతినిధుల బృందం ఆత్మకూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి మొగిలిచర్ల వీరస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర అవుతున్నా ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మోసం చేస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు చిన్నచిన్న హామీలు తప్ప ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి రైతులను, నిరుద్యోగులను మోసం చేస్తూ కాలం వెళ్లబుచ్చుతోందని ఆరోపించారు. 420 వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని గ్రామీణ పేదల సంఘం డిమాండ్ చేస్తోందని, ప్రజలందరూ ఈ వాగ్దానాల అమలు కోసం పోరాటం చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో ప్రజలను మోసం చేసిందని, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, ప్రజలకు చిన్న చిన్న సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ భూములకు రక్షణ కల్పించాలని, ఇనాం భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ పొన్నాల సమ్మయ్య, ఓపీడీఆర్ (ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మార్క వెంకటయ్య, గ్రామీణ పేదల సంఘం భూపాల్‌పల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిరిపెల్లి రాజయ్య, గ్రామీణ పేదల సంఘం హనుమకొండ జిల్లా నాయకులు కామ్రేడ్ సంఘాల కోటేశ్వర్

# పులుకుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం



**వరంగల్ వాయిస్, దామెర:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు దామెర మండలం పులుకుర్తి గ్రామంలో ముగ్గులు వేసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పులుకుర్తి గ్రామ పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ ఎన్.వెంకటేష్, కార్యదర్శి శ్రీను, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గన్ను వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ బిక్షపతి, కాంగ్రెస్ నాయకుడు కిరణ్ కుమార్, కారోబార్ జి. ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ:** గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం పాలకుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శ్రీ శివ పార్వతి మహిళా సంఘంలోని ఇద్దరు సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శాసనసభ్యులు యశస్విని రెడ్డితో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా మహిళలకు ఆర్థిక ప్రగతి లభిస్తుందన్నారు. మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం అండగా నిలుస్తూ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తోందని, ఈ రుణాలతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తుందని వివరించారు. క్యాంటీన్‌లో తయారుచేసే భోజనం నాణ్యతతో పాటు రుచికరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. శాసనసభ్యులు యశస్విని రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తోందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఇతర మహిళలకు స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఉత్సాహంగా ఉండే మహిళలకు సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్, శాసనసభ్యులు క్యాంటీన్‌లో టిఫిన్ చేసి, అది రుచికరంగా ఉందని నిర్వాహకురాళ్లైన తరాల అనిత మరియు అదే కుటుంబానికి చెందిన మరో తరాల అనిత (తోడికోడళ్లు)లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





## నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలి..

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు.ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ పనితీరుకు సంబంధించిన డెమోను కలెక్టర్ పరిశీలించి, వచ్చే వారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫిజియోథెరపీ విభాగం సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ నిల్వ కేంద్రం నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, అకస్మాత్తుగా రక్తం అవసరమైనప్పుడు సరఫరా చేసేందుకు సరిపడా యూనిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యం కోసం వచ్చిన మహిళలతో కలెక్టర్ మాట్లాడగా, కొందరు ముక్కులో కండ పెరిగిందని, పరీక్షలు పూర్తయ్యాయని, ఆపరేషన్ చేయించుకోవడానికి వచ్చామని తెలిపారు. కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన మరో పేషెంట్ దరావత్ మంజులను ఆసుపత్రి వైద్య సేవల గురించి కలెక్టర్ అడగ్గా, పాము కరిచిందని, వెంటనే ఆసుపత్రికి రాగా సకాలంలో వైద్యం అందినట్లు ఆమె తెలిపారు. డయాలసిస్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్‌కు, రఘునాథపల్లి మండలం నవాబుపేటకు చెందిన బూడిద మేఘన వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు వివరించారు. అనంతరం, భోజన సదుపాయాలపై కలెక్టర్ రోగులను అడిగి తెలుసుకోగా, భోజనం సకాలంలో పెడుతున్నట్లు వారు తెలియజేశారు. దీనిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్లతో మాట్లాడుతూ, వైద్యులు అందుబాటులో ఉండాలని, నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల పర్యవేక్షకులు గోపాలరావు, ఆర్.ఎం.ఓ. లక్ష్మీనారాయణ, డాక్టర్లు అనురాధ శంకర్, పద్మ ప్రభ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌పై దృష్టి పెట్టండి

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆర్గనైజ్డ్ క్రైమ్స్‌కు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ టాస్క్ ఫోర్స్ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని టాస్క్ ఫోర్స్ కార్యాలయాన్ని ఆయన తొలిసారిగా సందర్శించారు. సీపీ కార్యాలయానికి చేరుకోగానే, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మొక్కను అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ ముందుగా టాస్క్ ఫోర్స్ కార్యాలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, టాస్క్ ఫోర్స్ అధికారులు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు, ఇప్పటివరకు ఎలాంటి నేరగాళ్లను పట్టుకున్నారు వంటి వివరాలపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల సమాచారం కోసం బలమైన ఇన్ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించాలని సూచించారు. టాస్క్ ఫోర్స్‌లో నాణ్యమైన పనితీరు ఉండాలని, నేరానికి సంబంధించిన మూలాల్లోకి వెళ్లి నేరస్తులను పట్టుకోవాలని అన్నారు. తప్పుడు చర్యలకు పాల్పడితే టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడతామనే భయాన్ని నేరస్థుల్లో కలిగించడంతో పాటు, ప్రజలకు టాస్క్ ఫోర్స్ పోలీసులపై నమ్మకం, గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. అలాగే, టాస్క్ ఫోర్స్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని, అలాంటి చర్యలను సహించేది లేదని పోలీస్ కమిషనర్ అధికారులను హెచ్చరించారు.

# ములుగు ప్రజల రుణం తీర్చుకుంటా

● మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు:** ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని, అర్హులందరికీ కచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండల కేంద్రం నుండి జీవింతరావుపల్లి గ్రామం మీదుగా గణేష్ పల్లి వరకు రూ. 3.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణ పనులు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో మొదటి దఫాగా ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల ఇళ్లను కేటాయించి పనులు ప్రారంభించిందని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి సంబంధించిన మంత్రి మరో వెయ్యి ఇళ్లను అదనంగా కేటాయించనున్నారని వివరించారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని, ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని అన్నారు. తాము ఇచ్చిన హామీ మేరకు ములుగును మున్సిపాలిటీగా, మల్లంపల్లి గ్రామాన్ని జేడీ మల్లంపల్లిగా మండలంగా ఏర్పాటు చేశామని తెలిపారు. తాము అధికారికంగా ఆమోదం పొంది ఇచ్చిన హామీలను చూపిస్తున్నామని, తాను ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, తాను గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని, నేడు మంత్రి సీతక్కతో కలిసి అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

◆ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న



**వరంగల్ వాయిస్, జనగామ:** బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అన్నారు. లింగాల గణపురం మండలం నెల్లుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ పాఠశాల, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి ఆడపిల్లలు ఎదగాలని, అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భోజన్న కోరారు. పాఠశాలల్లో చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, మైనర్ పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదలలో మార్పులు, దాని పర్యావసనాల గురించి వివరించాలన్నారు. పేరెంట్-టీచర్స్ సమావేశాలు నిర్వహించేటప్పుడు వ్యక్తిగత విషయాలను చర్చించాలని సూచించారు. అలాగే, బాల్య వివాహాలను నిరోధించాలని, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను తెలియజేయాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్న ఒక నేరపూరిత చర్య అని, మొబైల్ నిత్యజీవితంలో భాగమైనందున సెల్ వాడకం వల్ల కలిగే లాభనష్టాలను వివరించాలని కోరారు. సోషల్ మీడియా ద్వారా వస్తున్న తప్పుడు వార్తలను వివరించి, దాని నుండి బయటపడేలా విద్యార్థులను ప్రేరేపించాలన్నారు. జిల్లా బాలికల అభివృద్ధి అధికారి గౌసియా బేగం మాట్లాడుతూ, పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 వంటి టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రతి వారం ఒక కొత్త విషయంపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత శుభ్రత, ఆపద సమయంలో ఎలా రిపోర్ట్ చేయాలో చెప్పాలన్నారు. ప్రజ్వల సంస్థ ప్రతినిధి ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ, మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 30 వేల మంది అమ్మాయిలను రక్షించి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. తెలంగాణ విద్యా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల టీచర్లకు అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ట్రాఫికింగ్ చట్టాలు (బీ.ఎన్.ఎస్-భారతీయ న్యాయ సంహిత, ఐటీపీఎస్ఏ-ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యాక్ట్, పిఓసిఎస్ఓ-ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్ యాక్ట్, జేజే-జూవినల్ జస్టిస్ యాక్ట్) గురించి వివరించారు. ఈ శిక్షణలో లఘు చిత్రాల ద్వారా, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, గ్రూప్ డిస్కషన్ ద్వారా అంశాలను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏ.ఎం.ఓ. శ్రీనివాస్, స్టేట్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, కోఆర్డినేటర్ రాము, జనగామ జిల్లా నుండి కేజీబీవీ, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్‌ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి

## రష్మిక కొత్త పాత్రలో మైసా మూవీ

'కుబేర'తో తాజాగా విజయాన్ని సొంతం చేసుకున్న రష్మిక ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'మైసా' అనే సినిమాతో రానున్నారు. రవీంద్ర పూలే దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఐదు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. టైటిల్ పోస్ట్‌లో రష్మిక భయంకరమైన అవతారంలో కనిపించి ఆసక్తి పెంచారు. ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. 'ధైర్యం ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి'..! అంటూ నిర్మాణసంస్థ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో రష్మిక వారియర్‌గా కనిపించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. 'నేను ఎప్పుడూ కొత్తది, భిన్నమైనది, ఉత్తేజకరమైన చిత్రాలకు ప్రాధాన్యమిస్తాను. 'మైసా' అలాంటి వాటిలో ఒకటి. నేను ఇంతకు ముందెప్పుడూ పోషించని పాత్ర. ఎప్పుడూ అడుగుపెట్టని ప్రపంచం. ఇప్పటి వరకూ చేయని వెర్షన్. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే..' అంటూ రష్మిక ఈ సినిమా వివరాలు పంచుకున్నారు. ఇటీవల కాలంలో రష్మిక నటించిన సినిమాల్లో 'సికందర్' మినహా మిగిలినవన్నీ బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. కుబేర కూడా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రస్తుతం ఆమె లైనప్ ఆసక్తికరంగా ఉంది. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తున్నారు. అలాగే, బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానాకు జంటగా 'థామా'తో పలకరించనున్నారు. దీనికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా ఇది రూపొందుతోంది. ఇప్పుడు 'మైసా'ను ప్రకటించారు. వీటి తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'పుష్ప2'కు సీక్వెల్లోనూ ఈ బ్యూటీ నటించనున్నారు.




# భక్తిరసాన్ని పంచిన కన్నప్ప

## నీటీనటులంతా బాగా మెప్పించిన చిత్రం

మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా భారీ తారాగణంతో రూపొందిన...సినీ ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూసిన 'కన్నప్ప' చిత్రం ఎట్టకేలకు థియేటర్‌లో విడుదలైంది. అలనాటి కృష్ణంరాజు 'భక్తకన్నప్ప'కు విష్ణు 'కన్నప్ప'లో ఉన్న కొత్తదనం ఏమిటి... ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ తదితర నటీనటుల అతిథి పాత్రలు సినిమాకు ఎలాంటి అదనపు బలాన్ని ఇచ్చాయన్న ఆసక్తి ఆదినుంచి ప్రేక్షకుల్లో ఉంది. మహాకవి ధూర్జటి రాసిన కథ ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది. అడవిలో ఓ చిన్న గూడెంలో పుట్టి పెరిగిన తిన్నడు (మంచు విష్ణు) చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో అన్నీ తానై పెంచుతాడు తండ్రి నాథనాథుడు (శరత్‌కుమార్). తిన్నడు తన చిన్ననాట జరిగిన ఓ సంఘటనతో నాస్తికుడిగా మారిపోతాడు. విలు విద్యలో తిరుగులేని తిన్నడు తానుండే గూడెంతోపాటు, చుట్టుపక్కల గూడేలకు ఏ ఆపద వచ్చినా ముందుంటాడు. ఆ గూడేల్లో అనాదిగా ఓ ఆనవాయితీ ఉంటుంది. ఆపద వచ్చిన ప్రతిసారీ అందరూ క్షేమంగా ఉండాలని అక్కడ వెలసిన అమ్మవారికి ఒకరిని బలి ఇస్తుంటారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి గూడెం నుంచి బహిష్కరణకి గురవుతాడు తిన్నడు. మనసిచ్చిన నెమలి (ప్రీతి ముకుందన్) అతని వెంట నడుస్తుంది. అలా నాస్తికుడిగా వెళ్లిన తిన్నడు, గొప్ప శివ భక్తుడిగా ఎలా మారిపోయాడు? తిన్నడు అలా మారిపోవడానికి కారకుడైన రుద్ర ఎవరు? తిన్నడు భక్తుడిగా మారిపోయాక తన శివయ్య కోసం ఏం త్యాగం చేశాడు? అతనికి భక్త కన్నప్పగా పేరు రావడం వెనక కథేమిటి? పార్వతీదేవి శ్రీకాళహస్తిలో జ్ఞాన ప్రసూనాంబికగా ఎలా వెలసింది?ఎవరి చూపు పడనీయకుండా వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహాదేవశాస్త్రి (మోహన్‌బాబు)ఎవరు?తదితర విషయాల్ని హృద్యంగా చిత్రీకరించారు. నేటి తరానికి అర్థమయ్యే రీతిలో కన్నప్పను తెరకెక్కించారు. ముఖ్యంగా సెకండాఫ్ ఈ సినిమాని మరో స్థాయిలో నిలబెడుతూ, భక్త కన్నప్ప జీవితకథకి పూర్తిగా న్యాయం చేసింది. అతని తండ్రి నేపథ్యంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, తన తండ్రిని చంపిన శత్రువుపై తిన్నడు చేసిన యుద్ధం... ఇలా ప్రతిదీ ఆసక్తికరమే. ఇదంతా ఒక ఎత్తయితే, ప్రభాస్ వచ్చాక సినిమా మరో ఎత్తు. తిన్నడు భక్తుడిగా మారిపోయే కీలకమైన ఆ సన్నివేశాలు సినిమాపై గొప్ప ప్రభావం చూపిస్తాయి. ప్రభాస్‌కీ విష్ణుకీ మధ్య సంభాషణలు చాలా బాగుంటాయి. ప్రభాస్ ప్రశాంతంగా కనిపిస్తూనే రుద్ర పాత్రతో కట్టిపడేస్తాడు. విష్ణు కూడా లీనమై నటించారు. ఇక పతాక సన్నివేశాలు కథలోని అసలు సిసలు భక్తి కోణాన్ని ఆవిష్కరిస్తాయి. . స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన పాటలు మెప్పిస్తాయి. పాటల్లోనూ సాహిత్యం బాగుంది. నిర్మాణం ఉన్నతంగా ఉంది. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ భక్తి ప్రధానమైన ఈ కథని చెప్పడంలో స్పష్టత ప్రదర్శించాడు.

### ప్రభాస్ ఫ్యాన్స్ కు పండగే పండగ

### కన్నప్పలో అదరొగొట్టేలా రుద్ర పాత్ర

రెబల్ స్టార్ ప్రభాస్. సినిమాలో కీలకమైన 40 నిముషాల ఎపిసోడ్ ను ప్రభాస్ నిలబెట్టేసాడు. ప్రభాస్ డైలాగ్స్ విషయంలో రైటర్ పెన్నుకు పదును పెట్టాడు. ప్రభాస్ పెళ్లి డైలాగ్ కు థియేటర్స్ హోరెత్తాయి. ఇక శివయ్య కు తన కన్ను దానం చేసే సీన్ సినిమాకే హైలెట్ గా నిలిచింది. క్లైమాక్స్ లో తన అద్భుతమైన నటనతో మంచు విష్ణు ప్రేక్షకులతో కంటతడి పెట్టించాడు.



# రూట్ మార్చిన రామ్ పోతినేని

టాలీవుడ్ ట్రెండ్ మారింది. లవ్ స్టోరీస్, యాక్షన్ ఎపిసోడ్లను పక్కకు పెట్టి హారర్, మైథాలజీ, సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాల వైపుగా అడుగులేస్తోంది. హనుమాన్, విరూపాక్ష, పొలిమేర, కల్కి చిత్రాలను ఆడియన్స్ కొత్తగా ఫీలై హిట్స్ ఇవ్వడంతో వీటిపై నిర్మాతలు, దర్శకులు దృష్టి పెడుతున్నారు. ఇక ఇండస్ట్రీలో ఏది నడిస్తే అదే ఫాలో అవ్వాల్సిన పరిస్థితి హీరోలది. ట్రెండ్‌కు తగ్గట్టుగా మారిపోతున్నారు. చిరంజీవి విశ్వంభర, ప్రభాస్.. నిఖిల్ స్వయంభు, తారక్– త్రివిక్రమ్ కథలు సోషియో ఫాటసీ అండ్ మైథాలజీ రిలేటెడ్ ఫిల్మ్స్ చేస్తున్నారు. మైథాలజీ మాత్రమే కాదు సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాలకు సై అంటున్నారు హీరోస్. ముఖ్యంగా బ్లాక్ మ్యాజిక్, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్టులపై ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. ఇప్పుడు ఈ జోనర్‌లోకి ఎంటర్ కాబోతున్నారు రామ్ పోతినేని. మాస్ ఇమేజ్ కోసం పరుగులెత్తి యూ టర్న్ తీసుకున్న రామ్ ఇప్పుడు అతీంద్రియ శక్తుల కాన్సెప్టు కథతో రాబోతున్నాడట. ఈ కథ ఫస్ట్ రానా నుండి చైతూ ఆపై రామ్ దగ్గరకు వచ్చినట్లు తెలుస్తోంది. కిశోర్ అనే కొత్త దర్శకుడి ఛాన్స్ ఇస్తున్నాడట రామ్. ఈ సినిమాను ఆర్కా మీడియా నిర్మిస్తుండగా రానా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆంధ్రా కింగ్ తాలూకాతో బిజీగా ఉన్న ఈ ఎనర్జటిక్ స్టార్ ఈ ఇయర్‌ఎండిరగ్ నుండి ఈ ప్రాజెక్టును పట్టలెక్కించనున్నాడని టాక్. మొత్తానికి టాలీవుడ్ మారుతోంది. రొటీన్ మాస్ కథలను పక్కనపెట్టి విభిన్న కథలతో సినిమాలు చేసేందుకు కుర్ర హీరోలు ముందుకు వస్తున్నారు. ఇక ప్రేక్షకుల నుండి రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి.



# అంతర్గత రహదారులకు శంకుస్థాపన

- 31వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి హంటర్ రోడ్డులోని 31 వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా హంటర్ రోడ్డు వాసవి కాలనీ, గాయత్రి కాలనీలో రూ. 88.73 లక్షలతో నూతన అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. తొలుత ఎస్సీ కాలనీలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల చేతుల్లో అభివృద్ధికి నోచుకోని అన్ని ప్రాంతాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో కూడా ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత పర్యటించిన క్రమంలో నా దృష్టికి వచ్చిన అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం కలిసికట్టుగా ముందుకు వెళ్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు సకాలంలో పనులను ప్రారంభించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు సత్తు రమేష్, కృష్ణ, తాళ్లపల్లి రాజు, బింగి రమేష్ యాదవ్, మామిండ్ల సురేష్, మునిసిపల్ అధికారులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.



# కపాలిని క్రమంలో అమ్మవారు

## రెండో రోజుకు చేరిన శాకంభరి ఉత్సవాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. తిథిమండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి షడ్వేరాలలో జ్ఞానశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి కపాలినీ మాతగాను క్రియాశక్తిని షోడశీ క్రమాన్ని అనుసరించి భగమాలినీ మాతగాను అలంకరించి పూజారాధనలు జరిపించారు. శుక్రవారం కావడంతో భక్తులు వేలాదిగా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఉదయం, సాయంత్రం పూజానంతరం ప్రసాద వితరణ జరిపించారు. అమ్మవారిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తానుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరిరామేశ్వరరావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు, ఈఓ శేషభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పాల్గొని మహా అన్నదానం నిర్వహించారు. శాకంభరి ఉత్సవాల సందర్భంగా సినీ నటులు కొణిదెల నాగబాబు సతీమణి పద్మజ అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఆసుపత్రుల్లో వసతులపై సమీక్ష

**పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, తెలంగాణ ప్రభుత్వం నియమించిన కేఎంసీ, నర్సంపేట, జనగామ వైద్య కళాశాలల పర్యవేక్షణ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్ లతోపాటు కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్ దాస్, వివిధ విభాగాధిపతులు, హనుమకొండ వరంగల్ జిల్లాల్లోని అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల కల్పనకు కావలసిన వివిధ అంశాలపై కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కాకతీయ మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆస్పత్రిని కమిషనర్ సందర్శించి అక్కడికి వస్తున్న పేషంట్స్, అందిస్తున్న ఓపి సేవలను గురించి ఏ విధంగా మెడికల్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు, ఎలా తరలిస్తున్నారనే వివరాలను సంబంధిత వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఎంజీఎంతో పాటు సికేఎం ఆస్పత్రులను సందర్శించి వాటి వివరాలను, సమకూర్చాల్సిన సౌకర్యాలను గురించి వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సమీక్ష సమావేశంలో వివిధ విభాగాల్లో వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్ ఎన్ఎంసి నిబంధన ప్రకారం ఉండాల్సిన, సమకూర్చాల్సిన సౌకర్యాల గురించి కూలంకషంగా చర్చించారు. కాకతీయ మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు, సౌకర్యాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు.

వరంగల్ ఎంజీఎం, ఆస్పత్రిని ఓపి విభాగాలను సందర్శించి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవలకు వస్తుంటారని, ఓపి నమోదు కోసం ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారని కమిషనర్ పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలోని ఈ ఔషధీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. అదేవిధంగా ఎంజీఎం ఆసుపత్రిలో ఓపి సేవల విభాగంలో అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ప్రసూతి సేవలను గురించి, వైద్యులు సిబ్బంది, తదితర వివరాలను వైద్యాధికారులను కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, కేఎంసీ ఏడి రమేష్, ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, సీకేఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సునీత, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# సీనియర్ జర్నలిస్ట్ ఆడెపు మహేందర్ మృతి

- నివాళులర్పించిన పాత్రికేయులు
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.25వేల తక్షణ సాయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హన్స్ ఇండియా ఇంగ్లీష్ పత్రిక వరంగల్ బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్ (55) గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. గత 15 సంవత్సరాలుగా హన్స్ ఇండియా దిన పత్రికలో ఉమ్మడి వరంగల్ బ్యూరో చీఫ్ గా కొనసాగుతున్న మహేందర్ తనదైన శైలిలో అనేక పరిశోధనాత్మక కథనాలు రాశారు. హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో జర్నలిస్ట్ గా ఆయన పని చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహేందర్ మృతి జర్నలిస్టులను శోకసంద్రంలో ముంచింది. ఆడెపు మహేందర్ మృతదేహాన్ని ప్రైవేటు ఆస్పత్రి నుంచి హనుమకొండ పద్మాక్షి గుట్ట సమీపంలోని శివముక్తిధామ్ కు తరలించారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. శివముక్తిధామ్ లో ఆయన భౌతికకాయానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు, వివిధ జర్నలిస్ట్ సంఘాల నేతలు, బంధుమిత్రులు ఘనంగా నివాళులర్పించారు. మహేందర్ సేవలను కొనియాడారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నుంచి తక్షణమే వారి కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, ఉపాధ్యక్షులు గాకారపు శ్యాం, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు పిన్నా శివకుమార్, మహేష్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. మహేందర్ మృతికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకట రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వేణుమాధవ్, కంకనాల సంతోష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పాత్రికేయుడు మహేందర్ మృతికి మంత్రి సీతక్కతోపాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ జన్ను శోభారాణి అనిల్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామక శ్రీనివాస్ తీవ్ర సంతాపం తెలియజేశారు.

### టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం..

ఆడెపు మహేందర్ మృతికి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ తోపాటు హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. టీడబ్ల్యూజే (ఐజేయూ) ములుగు జిల్లా అధ్యక్షులు ఎండీ.షఫీ హమ్మద్, ఉపాధ్యక్షలు బేతి సతీష్ యాదవ్, గంపల శివతోపాటు టీయూడబ్ల్యూజే-హెచ్ (143), టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు తీవ్ర సంతాపం ప్రకటించాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com